

సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారానికి 18.724 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 15,267 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,210
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,515
3 శాతం జీఎస్టీతో..	రూ.5,680
సవర (8 గ్రా)	రూ.45,440

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.5 /26.6

మంగళవారం గాలిలో తేమ 77 శాతం ఉంది. బుధవారం ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయని, జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు

• వీఎస్‌యూ వైస్ చాన్సలర్ సుందరవల్లి



ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వెంకటాచలం: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీతోపాటు, రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డిని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది శాలువాలతో సత్కరించారు. అనంతరం వైస్ చాన్సలర్ మాట్లాడుతూ వృత్తికి వన్నెతెచ్చేలా ప్రతి అధ్యాపకుడు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వీఎస్‌యూ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతిరెడ్డి నియామకం

• టీటీడీ ఉత్తర భారతదేశ దేవాలయాల సలహా కమిటీ అధ్యక్షురాలిగా..



వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): తిరుమల తిరుపతి దేవస్థానం ఉత్తర భారతదేశ దేవాలయాల సలహా కమిటీ అధ్యక్షురాలిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత రెండు సంవత్సరాలుగా ఇదే పదవిలో కొనసాగిన ఆమె హైందవ ధర్మాన్ని పరిరక్షించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు. జమ్ము, కశ్మీర్‌లలో అత్యంత వైభవంగా ప్రశాంత వాతావరణంలో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాలను నిర్మించారు. ఆమె సేవలను గుర్తించిన టీటీడీ మరో రెండేళ్లపాటు పదవిలో కొనసాగేలా ఉత్తర్వులు జారీ చేశారు.

డీఆర్వో బదిలీ



నూతన డీఆర్వో లక్ష్మీశివజ్యోతి

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా రెవెన్యూ అధికారిణి సి.వెంకటనారాయణమ్మను బదిలీ చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల డీఆర్వోగా పనిచేస్తున్న కె.లక్ష్మీశివజ్యోతిని జిల్లా రెవెన్యూ అధికారిణిగా నియమించారు. వెంకటనారాయణమ్మను అమరావతిలోని జనరల్ అడ్మినిస్ట్రేషన్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలిచ్చింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 35 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేయగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న బి.చిన్న ఓబులేసును తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా నియమించారు. అలాగే పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న వి.దేవేందర్ రెడ్డిని నెల్లూరు జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డీపీఎంగా నియమించారు. కలెక్టరేట్‌లో భూసేకరణ విభాగంలో డీడీఎల్‌గా ఉన్న పద్మావతిని చిత్తూరు డీఆర్వోగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కల్తీ.. సుస్తీ

రోడ్డు పక్కన విక్రయించే ఘుమఘుమలాడే ఆహారం, రంగురంగుల పదార్థాలు తిని ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. విక్రయదారులు రుచి, ఆకర్షణ కోసం రకరకాల పదార్థాలు, రంగులు కలిపి విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఆయా ఆహారశాలల వద్ద పరిశుభ్రత కొరవడినా పట్టించుకునేవారు కరువయ్యారు.

ఆహారం రంగులమయం

- రోడ్ సైడ్ ఆహారంతో పొంచి ఉన్న ముప్పు
- విచ్చలవిడిగా ఏర్పాటవుతున్న ఆహారశాలలు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు
- ఫుట్‌పాత్‌లపై చికెన్ నాణ్యత ప్రశ్నార్థకం
- ఆహారంలో ప్రమాదకర బాక్టీరియా అవశేషాలు
- పరిశుభ్రత కొరవడినా పట్టించుకోని అధికారులు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కల్తీ ఆహారం ప్రజల ఆరోగ్యం పాలిటశాపంగా మారింది. రంగులు కలిపిన నాణ్యత లేని ఈ ఆహారం తింటే ఆస్పత్రిపాలు కాక తప్పదని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. నెల్లూరు నగరంలో రోడ్ సైడ్ ఆహారశాలలు, టిఫిన్ సెంటర్లు విచ్చలవిడిగా ఉన్నాయి. ఉద్యోగులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతోపాటు పనులకు వెళ్లేవారు సైతం నిత్యం వేలాది మంది ఈ ఆహారాన్ని తీసుకుంటున్నారు. ముఖ్యంగా యువత, చిన్నారులను ఈ ఆహారం ఆకర్షిస్తుంది. కానీ బజారు ఆహారం వెనుక అత్యంత ప్రమాదకర బాక్టీరియా ముప్పు పొంచి ఉందని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల అధికారుల చేస్తున్న దాడుల్లో పలుచోట్ల తయారు చేసి విక్రయిస్తున్న ఆహారశాలలు, రోడ్ సైడ్ ఫుడ్‌లో నాణ్యత లేకపోవడంతో పాటు ప్రమాదకర బాక్టీరియా ఉన్నట్లు గుర్తించారు.

కూడలి ప్రాంతాలే అడ్డా

ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల వద్ద, వసతిగృహాలు, విద్యార్థులు ఎక్కువగా ఉండే కూడలి ప్రాంతాల్లో ఈ రోడ్ సైడ్ ఆహారం విక్రయాలు బాగా జరుగుతున్నాయి. ప్రధానంగా ఆహార బండ్ల వద్ద ఎక్కువగా 90 శాతం మంది యువతతోపాటు చిన్నారుల కోసం వారి తల్లిదండ్రులు ప్యాకింగ్ చేయిస్తూ కన్పిస్తున్నారు. అపరిశుభ్ర, కల్తీ పదార్థాలతో తయారైన ఈ అల్పాహారాలను తిన్నవారు ఎమీబియాసిస్, మలబద్ధకం తదితరాల రోగాల బారిన పడుతున్నారు. ఇక పానీపూరీ, చాట్‌ల ద్వారా బాక్టీరియా, ఫంగస్ మన శరీరంలోకి వెళుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. గతంలో హైదరాబాద్ కేంద్రంగా జరిగిన ఓ అధ్యయనంలో ప్రమాదకర క్యాండిడా ఫంగస్ పానీపూరి ద్వారా మన శరీరంలోకి ప్రవేశిస్తుందని గుర్తించారు. అలాగే స్ట్రీట్ ఫుడ్ వల్ల కలరా వంటి వ్యాధులు సైతం వ్యాపించే ప్రమాదం ఉందని తెలుస్తోంది.

పరిశుభ్రతకు పంగనామం

అపరిశుభ్రత కలిగిన ప్రాంతాల్లో విక్రయించే ఆహారంలో ఈకొలి, క్లెబ్సిల్లా, స్యూడో మెనాస్ వంటి బాక్టీరియాలు ఉంటాయని, ఇవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని వైద్యులు చెబుతున్నారు. ఈకొలి, క్లెబ్సిల్లా కారణంగా నీళ్ల విరోచనాలు, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈ విచ్చలవిడి కల్తీ ఆహారం విక్రయాలపై అధికారులు దృష్టి సారించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నెల్లూరు నగరంలో..

జనాభా - 8 లక్షలు	
గృహాలు - 1.51 లక్షలు	
ఫుట్‌పాత్‌లపై ఆహార విక్రయశాలలు - సుమారు 2,150	
టిఫిన్ సెంటర్లు - సుమారు 4,200	
పారిశుద్ధ్య నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు ఉండేవి - 3,500	
నిత్యం బయట ఆహారం తింటున్న వారు - సుమారు 1.25 లక్షల మంది	

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

నెల్లూరు నగరంలో లైసెన్స్ పొందిన హోటళ్లు, రెస్టారెంట్లు వందల సంఖ్యల్లో ఉన్నాయి. తోపుడుబండ్లు, రహదారుల పక్కన ఆహారం విక్రయించే ఫుడ్ ట్రక్‌లు, ఫుట్‌పాత్‌లపై అల్పాహార వ్యాపారాన్ని ఉపాధిగా చేసుకొని జీవించేవారు వేలాదిగా ఉన్నారు. ఈ రోడ్ సైడ్ ఆహారం దొరికేచోట పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నా ప్రజలు లెక్కచేయకుండా ఈ తిండి తిని రోగాలబారిన పడుతున్నారని తెలుస్తోంది. ఉదాహరణకు నూడిల్స్ తయారీకి వినియోగించే నీరు, పిండి ప్రమాణాలకు తగ్గట్లుగా ఉండడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అలా తయారైన నూడిల్స్‌ను సాయంత్రం నుంచి మురుగు కాలువల పక్కనే ఏర్పాటు చేసుకున్న బండ్లపై రుచి కోసం పలు రకాల పదార్థాలు, ఆమ్లాలను సైతం కలిపి విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఈ నూడిల్స్ తయారీలో వినియోగించే సాస్‌ల నాణ్యత ఏపాటిదో గతంలో అధికారులు నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైంది.



పానీపూరీ బండ్లు

జీర్ణకోశ వ్యాధులు

కల్తీ ఆహార పదార్థాలు తినడం వల్ల అధికశాతం మంది జీర్ణకోశ వ్యాధుల బారిన పడతారని, అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు తినడం వల్ల డయేరియా, అతిసార వంటి వ్యాధులకు గురవుతారని, కలుషిత ఆహారం ప్రభావం లివర్‌పై కూడా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇంట్లో తయారు చేసిన ఆహార పదార్థాలు తీసుకోవడమే ఉత్తమమని, పిల్లల ఆహారం విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

టీడీపీ హయాంలోనే విద్యుత్ బకాయిలు

- కండలేరు ఎత్తిపోతలపై ఈనాడు తప్పుడు కథనాలు
- 2017లో రూ.4.80 కోట్ల బకాయిలు
- తడిసిమోపెడై పెనాల్టీతో కలిపి రూ.7 కోట్లు
- వాస్తవాలను దాచే యత్నం
- రైతుల ధర్నా పేరుతో పంప్‌హౌస్ వద్ద సోమిరెడ్డి డ్రామాలు

వాస్తవానికి రైతులకు కండలేరు ఎత్తిపోతల ద్వారా ఎడమకాలువకు నీరు అవసరమైతే మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలుగుగంగ అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు రైతులు తమ పంటలు ఎండుతున్నట్టు మంత్రి దృష్టికి తీసుకురాకపోవడంతో ఎత్తిపోతలతో పనిలేకుండాపోయింది. గత నాలుగేళ్లుగా ఎడమగట్టు కాలువకు గ్రావిటీ ద్వారానే జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/పొదలకూరు: అసలు నిజాలు దాచి ప్రభుత్వంపై బురద చల్లడమే 'ఈనాడు' పనిగా పెట్టుకుంది. తప్పుడు కథనాలను వండివార్చుతూ రైతులపై ప్రేమ ఒలకబోస్తున్నట్టు ప్రయత్నిస్తోంది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా టీడీపీ నాయకులు చెప్పింది చెప్పినట్టు కథనాలు ప్రచురిస్తూ రైతుల వద్ద అభాసుపాలవుతోంది. కండలేరు ఎత్తిపోతల పథకంపై టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మీడియా సమావేశాల్లో ఏవైతే వల్లెవేస్తున్నారో వాటినే 'ఈనాడు' ప్రచురించి ఆనందపడుతోంది. రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తప్పుచేస్తున్నట్టు 'మంత్రి వర్యా.. పంటలను ఎండగట్టడమే రైతులకు స్వర్ణయుగమా' అంటూ మంగళవారం కథనాన్ని ప్రచురించింది.

టీడీపీ హయాంలోనే..

సోమిరెడ్డి వారం రోజులుగా సర్వేపల్లి నియోజకవర్గంలో మీడియా సమావేశాల్లో కండలేరు ఎత్తిపోతల పథకం విద్యుత్ బకాయిలు రూ.7 కోట్లు ఉన్నాయని, ప్రభుత్వం వాటిని చెల్లించకుండా కాలయాపన చేస్తోందని, మంత్రి కాకాణి పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. వాస్తవానికి 2017లో అప్పటి టీడీపీ హయాంలో ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్న సోమిరెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి పంప్‌హౌస్‌లో ఉపయోగించిన 2,050 హార్స్‌పవర్ కలిగి రెండు విద్యుత్ మోటార్లకు రూ.4.80 కోట్ల విద్యుత్ బిల్లులు బకాయిలు పడ్డారు. అప్పటి నుంచి ఆ బకాయిలను చెల్లించకపోవడంతో పెనాల్టీ రూపంలో రూ.7 కోట్లు బకాయిలుగా చూపుతోంది. కాగా అధికారుల నివేదికల ప్రకారం ప్రభుత్వం త్వరలో ఎత్తిపోతల విద్యుత్ బకాయిల చెల్లింపునకు రూ.9 కోట్లు విడుదల చేసే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిసింది.



ఎత్తిపోతల పంప్‌హౌస్ హెవీ మోటార్లు

పంట ఎండిన దాఖలాలు లేవు

కండలేరు ఎడమగట్టు కాలువ కింద నీరు లేకపోవడం వల్ల ఎక్కడా పంటలు ఎండిన దాఖలాలు లేవు. ఈ కాలువ ద్వారా 20,704 ఎకరాలకు సాగునీటిని అందించే అవకాశం ఉంది. గత టీడీపీ హయాంలో సోమిరెడ్డి మంత్రిగా ఎత్తిపోతల ద్వారా కాలువకు నీటిని విడుదల చేయించి కేవలం 1,800 ఎకరాల్లోనే పంటలు పండించారు. నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రావిటీ ద్వారా చేజర్ల, పొదలకూరు, వెంకటాచలం మండలాల్లో 34 చెరువులకు నీటిని విడుదల చేసి సుమారు 22 వేల ఎకరాల్లో వరిపంటలు పండించారు. సోమిరెడ్డి తన రాజకీయ అవసరాల కోసం ఎత్తిపోతలను వాడుకుంటున్నట్టు ఈ ప్రాంత రైతులు మండిపడుతున్నారు. కండలేరు నీటిని నిమ్మతోటలకు పెట్టుకుంటే వేరుకుళ్ల తెగులుతో చెట్లు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.



రైతులతో మాట్లాడుతున్న తెలుగుగంగ ఈఈ అనిల్‌కుమార్‌రెడ్డి

పంటలు ఎండడం లేదు



ఎడమగట్టు కాలువ ఆయకట్టు కింద నిమ్మతోటల సాగే అధికంగా ఉంది. ఏ గ్రామంలోనూ నిమ్మతోటలు ఎండినట్టు చూడలేదు. మా తోటలు జలాశయం సీపేజీ వాటర్ వల్ల గతేడాది ఎండిపోయాయి. ఇదే విషయాన్ని తెలుగుగంగ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. టీడీపీ నాయకుడు డ్రామాలాడుతూ రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నారు.

– వై.పెంచలరెడ్డి, రైతు, పులికల్లు

తోటలకు కండలేరు జలాలు పనికిరావు



నిమ్మతోటలకు కండలేరు జలాలు పనికిరావు. ఈ విషయం రైతులందరికీ తెలిసినా సోమిరెడ్డికి చెప్పేవారు లేరు. కండలేరు నీటిని తోటలకు పెట్టుకుంటే వేరుకుళ్ల తెగులు సోకి ఎండిపోయే ప్రమాదం ఉంది. కనుక రైతులు కాలువ నీటిని తోటలకు పెట్టుకోవడం లేదు.

– కె.కోటేశ్వరరావు, రైతు, ఊసపల్లి

రైతులు నీళ్లు అడగడం లేదు

ఎడమగట్టు కాలువ కింద రైతులు నీళ్ల అడగడం లేదు. మేము గ్రామాలన్నీ పర్యటించి విచారించగా ప్రస్తుతం కాలువ నీటితో అవసరం లేదని చెప్పారు. గతంలో ఎత్తిపోతలకు సంబంధించి రూ.4.80 కోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నాయి. అవి పెనాల్టీల రూపంలో రూ.9 కోట్ల వరకు అయ్యాయి. ఈ విషయాన్ని ప్రభుత్వానికి రాతపూర్వకంగా నివేదించాం. త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

– అనిల్‌కుమార్‌రెడ్డి, ఈఈ, తెలుగుగంగ

అవకతవకలు జరిగేతే ఉపేక్షించేది లేదు

• కలెక్టర్ ఎం.హరినారాయణన్



జమ్మలపాళెం గ్రామస్తులను విచారిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

జలదంకి: ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడితే వారిపై ఉపేక్షించేది లేదని కలెక్టర్ ఎం.హరినారాయణన్ హెచ్చరించారు. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారు, ఓట్ల తొలగింపు, వేరే ప్రాంతాలకు నివాసం మార్చుకున్న ఓట్ల తొలగింపుపై వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు మంగళవారం కలెక్టర్ జలదంకి మండలంలోని జమ్మలపాళెంలో ప్రతి ఇంటికీ వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాపై ర్యాండమ్ తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. వాస్తవమైన ఓటర్ల జాబితా తయారీకి ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. చనిపోయిన, రెండు ఓట్లు నమోదైన వారి పేర్లు తొలగింపు తదితరాలపై ఇళ్లకు వెళ్లి కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పారదర్శకంగా ఓటరు జాబితా సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, బీఎల్వోలు పాల్గొన్నారు.

98.56 శాతం మందికి పింఛన్లు

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా వేగవంతంగా జరిగింది. మంగళవారం నాటికి 98.56 శాతం మందికి వలంటీర్లు వైఎస్సార్ పింఛన్ కానుకను పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 3,09,825 మందికి పింఛన్ నగదును అందించాల్సిఉండగా 3,05,378 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వలంటీర్లు గత ఐదు రోజులుగా లబ్ధిదారుల ఇంటి ముంగిటకు వెళ్లి పింఛన్ నగదు అందించారు. ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందుతున్న వారికి, పని ప్రదేశాల్లో ఉన్న కార్మికులు, వ్యవసాయ కూలీలకు సైతం ఆయా ప్రాంతాలకు వెళ్లి వలంటీర్లు పింఛన్లు అందజేశారు.



కలెక్టరేట్‌లోని తిక్కన సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జేసీ కూర్మనాథ్ తదితరులు





విశాఖపట్నంలో మంగళవారం జరిగిన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతులమీదుగా అవార్డులు అందుకుంటున్న కొడవలూరు మండలంలో ఎస్జీటీగా పనిచేస్తున్న తోట లక్ష్మీభవాని, టీపీగూడూరు మండలం చెన్నాపల్లిపాళెం జెడ్పీ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చేవూరు వెంకట ఫణికుమార్, గొలగమూడి ఎంజేపీఏపీబీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న డి.కొండలరావు



భద్రతా ప్రమాణాలు పాటించాలి

• పోర్టు సీఓఓ సంజయ్

ముత్తుకూరు: ఉద్యోగులు, కార్మికులు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని అదానీ కృష్ణపట్నంపోర్టు సీఓఓ సంజయ్ కోత అన్నారు. 'లైఫ్ సేవింగ్ సేఫ్టీ రూల్స్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం పోర్టులో జరిగిన అవగాహన ర్యాలీని ఆయన పచ్చజెండా ఊపి ప్రారంభించారు. విధినిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. అనంతరం 'నా భద్రత–నా సొంతం' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సేఫ్టీ హెడ్ రామకృష్ణ, సెక్యూరిటీ హెడ్ మనోహర్‌బాబు, మనీష్‌దావే, హెచ్ఆర్ డీజీఎం శ్రీనివాస్, అడ్మిన్ ఏజీఎం గంగాసతీష్ పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 42 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కృష్ణపట్నం హైస్కూల్‌కి చెందిన 20 మంది, ముత్తుకూరు హైస్కూల్‌కి చెందిన 22 మంది ఉపాధ్యాయులను సన్మానించారు.

క్లుప్తంగా

ఐటీఐ ప్రిన్సిపల్‌కు అవార్డు



మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(టౌన్): నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్ రెడ్డికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఐటీఐలో మౌలిక వసతులు కల్పించడం, మెగా రక్తదాన శిబిరాల నిర్వహణ, మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన, ఐటీఐలో వంద శాతం సీట్ల భర్తీ తదితర వాటిని గుర్తించి ఈ అవార్డును అందజేశారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



మనుబోలు: 16వ నంబర్ జాతీయ రహదారిపై మనుబోలు ఎస్‌బీఐ ఎదురుగా సోమవారం అర్ధరాత్రి కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రోడ్డు దాటుతున్న వ్యక్తిని గూడూరు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి వయసు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. మనుబోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

అత్తపై అల్లుడి హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): కుటుంబకలహాల నేపథ్యంలో అత్తపై అల్లుడు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా గూడూరు మండలం తిప్పవరప్పాడు గ్రామానికి చెందిన కల్పన, చైతన్య దంపతులకు చెంచురామ్, చక్రి సంతానం. చైతన్య వరికోత మెషీన్ ఆపరేటర్‌గా పనిచేస్తుంటాడు. మద్యానికి బానిసైన అతను భార్యను వేధించడం ప్రారంభించాడు. తల్లిదండ్రులు సైతం అతడికే వత్తాసు పలికారు. వివాహ సమయంలో భార్య తల్లిదండ్రులు కట్నం కింద ఇచ్చిన 10 సవర్ల బంగారు ఆభరణాలను తాకట్టుపెట్టి ఆ డబ్బును వ్యసనాలకు ఖర్చు చేసేశాడు. ఈ విషయమై దంపతుల నడుమ ఘర్షణ జరిగింది. భర్త, అత్తింటి వేధింపులు తాళలేక రెండునెలల క్రితం కల్పన తన పిల్లలతో కలిసి నెల్లూరు వేదాయపాళెంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చేసింది. చైతన్య నెల్లూరుకు చేరుకుని పిల్లలను తనతో పంపాలని కోరగా కల్పన తల్లి అడ్డుకుంది. దీంతో ఆమెపై దౌర్జన్యం చేసి బలవంతంగా చిన్న కొడుకును తీసుకెళ్లాడు. పెద్దలు సర్దిచెప్పడంతో కొద్దిరోజుల తర్వాత బాబును తిరిగి తల్లికి అప్పగించాడు. అప్పటి నుంచి అతను తన అత్త మంగమ్మ మీద కక్ష పెంచుకున్నాడు. ఈనెల 4వ తేదీ సాయంత్రం చైతన్య మరోమారు భార్య వద్దకు వచ్చి పిల్లలను ఇవ్వాలంటూ గొడవకు దిగాడు. మంగమ్మ అడ్డుకుని పెద్దల సమక్షంలో మాట్లాడుకుని కల్పనను కాపురానికి పంపుతానని చెప్పింది. కోపోద్రిక్తుడైన చైతన్య పక్కనే ఉన్న రోకలిబండతో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. కల్పన, ఆమె తండ్రి, అపార్ట్‌మెంట్ వాసులు అడ్డుపోవడంతో చైతన్య పరారయ్యాడు. మంగమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కల్పన ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు చైతన్యపై సోమవారం అర్ధరాత్రి హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.65
సన్నవి : రూ.40
పండ్లు : రూ.10

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	151
లేయర్ (లైవ్) :	105
బ్రాయిలర్ చికెన్ :	256
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	286
లేయర్ చికెన్ :	178

భావితరాలను తీర్చిదిద్దే గురువులకు వందనం



పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

- నెల్లూరులో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ
- 48 మందికి పురస్కారాల అందజేత

నెల్లూరు(దర్గామిట్ట): భావితరాలను తీర్చిదిద్దే గురువులకు ఘన సత్కారం లభించింది. నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జేసీ ఆర్.కూర్మనాథ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులు రాధాకృష్ణన్ అడుగుజాడల్లో నడుస్తూ పిల్లలను సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తనకు చదువు చెప్పిన గురువులను గుర్తు తెచ్చుకున్నారు. టీచర్ల సేవలను సమాజం ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటుందని తెలిపారు. పిల్లల జీవితాల్లో ఉపాధ్యాయులు వెలుగులు నింపుతారన్నారు.

బడుల రూపురేఖలు మారాయి

ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యాబోధనను వృత్తిగా భావించకుండా బాధ్యతగా చూడాలని, సమసమాజ స్థాపనకు పాటుపడాలని తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ తన ఉపాధ్యాయ వృత్తి ద్వారానే అత్యున్నత స్థాయికి వెళ్లారన్నారు. పేద పిల్లలకు విద్య ద్వారానే మంచి భవిష్యత్ ఉంటుందని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నేడు కార్పొరేట్ స్కూల్స్‌లో లేని విధంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చదువుకు ఎంతో విలువ ఉందన్నారు. ప్రతి విద్యార్థిని ప్రయోజకులను చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

మంచి సంప్రదాయం

జేసీ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించడం మంచి సంప్రదాయమన్నారు. గురువు విలువ, ప్రాధాన్యత వెలకట్టలేనిదన్నారు. ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖాధికారి నారాయణరావు, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, సోషల్ వెల్ఫేర్ డీడీ రమేష్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, మేయర్ స్రవంతి, నెల్లూరు నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యులు మొబినా, నెల్లూరు, కావలి ఉప జిల్లా విద్యాశాఖాధికారులు రఘురామయ్య, ప్రసన్నలక్ష్మి తదితరులు మాట్లాడారు. అనంతరం 48 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

నేటి నుంచి వేళాంగణిమాత జయంతి ఉత్సవాలు



వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న బిషప్ ప్రకాశం, గోవిందు ఇన్నయ్య, విలియం జార్జి తదితరులు



కోడూరులోని వేళాంగణిమాత చర్చి

నెల్లూరు(బృందావనం): మహాలక్ష్మీపురం కొత్తకోడూరు సముద్రతీరాన పరిశుద్ధ కోడూరు వేళాంగణిమాత జయంతి మహోత్సవాలు బుధ, గురు, శుక్రవారాల్లో జరుగుతాయని రోమన్ కేథలిక్ మిషన్ సింహపురి పీఠాధిపతి బిషప్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ ఎండీ ప్రకాశం తెలిపారు. కార్యక్రమాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం సంతపేట ఆర్సీఎం చర్చి ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాశం మాట్లాడుతూ తొలిరోజు పరిశుద్ధజపమాల, దివ్యబలిపూజ, నిస్సహాయుల సహాయమాత కార్యక్రమాలు జరుగుతాయన్నారు. రెండోరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిశుద్ధ జపమాల, నవదిన, ఆరాధన స్వస్థత ప్రార్థనలు, దివ్యబలిపూజ, పరలోక మార్గదర్శిని ధ్యానాంశం, చివరిరోజు సాయంత్రం 6 గంటలకు వేళాంగణిమాత తేరు ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో వికార్ జనరల్ రెవరెండ్ ఫాదర్ గోవిందు ఇన్నయ్య, కథిడ్రల్ విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ విలియం జార్జి, కోడూరు వేళాంగణిమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవ.ఫాదర్ పి.లూకాస్‌రాజ్, చాన్సలర్ రెవ.ఫాదర్ పి.జోసఫ్, రెవ, ఫాదర్ సీహెచ్ భాస్కర్, రెవ.ఫాదర్ కిరణ్ కిశోర్, రెవ.ఫాదర్ పి.లూర్థురెడ్డి పాల్గొన్నారు.

భక్తుల కోసం ఏర్పాట్లు

తోటపల్లిగూడూరు: జయంతి మహోత్సవాలకు కోడూరు వేళాంగణిమాత పుణ్యక్షేత్రం ముస్తాబైంది. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద వేళాంగణి మాత ఆలయంగా గుర్తింపు పొందిన ఈ చర్చిని 1980లో నిర్మించారు. చర్చిలో జాగరణ చేస్తే కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఈ క్రమంలో ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి అనేకమంది తరలివస్తారు. 8వ తేదీ చర్చికి భక్తులు పోటెత్తుతారు. ఆరోజు రాత్రి అధిక సంఖ్యలో జాగారం చేస్తారు. మరుసటి రోజు కోడూరు సాగరతీరంలో పుణ్యస్నానాలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆ మూడురోజులపాటు నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ నుంచి ప్రతి పదిహేను నిమిషాలకు ఒక ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంటుంది.

వ్యక్తి ఆత్మహత్య కేసులో నలుగురి అరెస్ట్

కావలి రూరల్: పట్టణ పరిధి బుడమగుంటలో బైక్ మెకానిక్ దావులూరి దేవకుమార్ ఆత్మహత్య కేసులో నలుగురు వ్యక్తులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు కావలి రూరల్ ఎస్సై సుమన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. బుడమగుంట ఎస్సీ కాలనీలో ఆదివారం గుండాబత్తిన సల్మాన్ అతని స్నేహితులు కలిసి బైక్ మెకానిక్ దేవకుమార్‌పై దాడి చేశారు. దీంతో దేవకుమార్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆత్మహత్యకు కారకులైన గుండాబత్తిన సల్మాన్, అతడి స్నేహితులు రవి, నవీన్, దర్గాబాబును పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

పక్కాగా ఓటర్ల జాబితా రూపకల్పన

- కలెక్టర్ హరినారాయణన్



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

కావలి: ఓటర్ల జాబితాను పక్కాగా రూపకల్పన చేసేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.హరి నారాయణన్ ఆదేశించారు. మంగళవారం ఆయన కావలి పట్టణ పరిధిలో ఉన్న ముసునూరు ఎస్సీ కాలనీలు, కావలి మెయిన్ రోడ్డు, టీచర్స్ కాలనీ తదితర చోట్ల పర్యటించారు. ఓటు తొలగించే ముందు వారి కుటుంబసభ్యులకు తెలియజేశారా లేదా? అని విచారించారు. మాకు తెలియజేసే మరణించిన వారి ఓటు తొలగించారని ఆయా కుటుంబాల వారు కలెక్టర్‌కు తెలిపారు. 2022 సంవత్సరం జనవరి 6వ తేదీ నుంచి 2023 సంవత్సరం జూలై 21వ తేదీ వరకు ఓటరు జాబితా నుంచి ఓటు తొలగించిన వారి విషయమై 8 నియోజకవర్గాల్లో తనిఖీలు చేశామని ఆయన అన్నారు. తొలగింపు ప్రక్రియ సక్రమంగా చేశారా? లేదా? అని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఓటరు రికార్డులు భద్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన కావలిలోని ఆర్డీఓ కార్యాలయ మీటింగ్ హాల్లో ఓటర్ల చేర్పులు, మార్పులకు సంబంధించి భద్రపరిచిన రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ వీకే శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ ఇ.కిరణ్, తహసీల్దార్ కె.మాధవరెడ్డి తదితరులున్నారు.

ఏసీసీ నెల్లూరు చాప్టర్ ఉత్తమ సేవలందించాలి

- రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



ఏసీసీ నెల్లూరు చాప్టర్‌ను ప్రారంభించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ఏసీసీ నెల్లూరు చాప్టర్ ఉత్తమ సేవలందించాలని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని మినర్వా గ్రాండ్‌లో ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ నెల్లూరు చాప్టర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఏసీసీ అధ్యక్షులు వీఎల్ ఇందిరాదత్, నెల్లూరు చాప్టర్ చైర్మన్ రంగయ్యనాయుడు వేమిరెడ్డికి స్వాగతం పలికారు. ఏసీసీలో సభ్యత్వం తీసుకున్న వారికి ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ 95 సంవత్సరాల చరిత్ర ఉన్న ఏసీసీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన నెల్లూరు చాప్టర్ ప్రారంభోత్సవానికి రావడం సంతోషంగా ఉందన్నారు. 35 మంది సభ్యులతో మొదలైన సంస్థలో నేడు 1,350 మంది సభ్యులు ఉండడం గొప్ప విషయమన్నారు. చెన్నై, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తర్వాత నెల్లూరులో ఐదోవది ప్రారంభమైందన్నారు. నెల్లూరు చాప్టర్ ద్వారా ప్రకాశం, రాయలసీమ జిల్లాలకు సేవలు అందుతాయన్నారు. ఏసీసీ విస్తరణలో ఇందిరాదత్ కృషి చాలా ఉందన్నారు. కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టుల ద్వారా వాణిజ్యపరంగా అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ ట్యాక్స్ రీసెర్చ్ ఫౌండేషన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, ఏసీసీ సభ్యులు ఎస్‌పీ రమేష్, బలరామ్‌నాయుడు, పలువురు వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

చంద్రబాబూ ప్రజల గురించి ఆలోచించావా?

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: 'చంద్రబాబూ.. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏనాడైనా ప్రజల గురించి ఆలోచించావా?.. దోచుకోవడం.. దాచుకోవడం పైనే దృష్టి పెట్టావు.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఇందుకూరుపేట మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా సమయంలో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు హైదరాబాద్‌లో విలాసవంతమైన జీవితం గడిపారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలకు అండగా నిలిచారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని బాబు, కళ్యాణ్ ఇప్పుడొచ్చి ఓటర్లను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. గత ఎన్నికల్లో ప్రజలందరూ జగన్ వైపు నిలిచి 151 అసెంబ్లీ, 22 ఎంపీ ఇవ్వడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో వాటికి మించి స్థానాలను అందించాలన్నారు. సంక్షేమ ప్రభుత్వంపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు. ప్రజలంతా సీఎం వైఎస్ జగన్ వైపే ఉన్నారన్నారు. బాబుది కపటప్రేమని ప్రతి ఒక్కరికీ తెలుసునన్నారు. బాబు ఆయన దత్తపుత్రుడు ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల మధ్య ఉండి తర్వాత తెలంగాణకు వలస వెళ్తారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరి శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, సీనియర్ నాయకుడు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ జయలక్ష్మి, ఎంపీపీ శంకరయ్య, సొసైటీ చైర్మన్లు శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణయ్య, కైలాసం శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి..

- ప్రభుత్వ భూమిని కాజేసేందుకు యత్నం
- ఈ కేసులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అరెస్ట్



నిందితుడు అజిత్ శ్రీనివాస్

ఉదయగిరి: ప్రభుత్వ భూమిని కాజేసేందుకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన కేసులో బుచ్చికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పూనపురెడ్డి అజిత్ శ్రీనివాస్‌ను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరచగా జడ్జి జె.అంజయ్య రిమాండ్ విధించారు. ఉదయగిరి సీఐ వి.గిరిబాబు కథనం మేరకు.. సీతారామపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ ఒకటిలో 430.29 ఎకరాల ఎకరాల మేత పోరంబోకు భూమి ఉంది. ఇందులో 25 ఎకరాల భూమిపై 2022 సంవత్సరంలో వెలిశెట్టి సూర్యకుమారి, వెలిశెట్టి దేవకుమార్, ఓంకారం వెంకటేశ్వరరాజు, చింతలగుంట శ్రీనివాసులు, పూనపురెడ్డి అజిత్ శ్రీనివాస్, మరో ఇద్దరు లాయర్లు కన్నేశారు. ఇందుకోసం ముందస్తుగా పథకం రచించి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. అజిత్ శ్రీనివాస్‌కు వారు ఆ భూమిని రూ.7 లక్షలకు విక్రయిస్తున్నట్లుగా అగ్రిమెంట్ చేశారు. అనంతరం అజిత్ శ్రీనివాస్ అప్పటి ఉదయగిరి సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి ఆ భూమిని తన పేరుపై రిజిస్టర్ చేయాలని అడిగాడు. ఆయన నిరాకరించడంతో ఇద్దరు లాయర్ల సహకారంతో కోర్టులో కేసు వేశాడు. అజిత్ శ్రీనివాస్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. కోర్టు ఉత్తర్వుల మేరకు ఉదయగిరి సబ్ రిజిస్ట్రార్ ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. ప్రభుత్వ భూమిని కాజేశారని గ్రామస్తులు అప్పట్లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి అది ప్రభుత్వ భూమిగా నిర్ధారించారు. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌ను గతేడాది అక్టోబర్‌లో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ప్రభుత్వ భూమికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కాజేసేందుకు ప్రయత్నించిన ఐదుగురు వ్యక్తులతోపాటు లాయర్ల మీద కూడా సీతారామపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తాజాగా అజిత్ శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం



వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

కావలి: పట్టణంలోని పాతూరులో ఉన్న వెంకటశేషాద్రి రైస్‌మిల్లులో రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు, కావలి అధికారి వెంకట్రామిరెడ్డి మంగళవారం పట్టుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి కావలికి తీసుకొచ్చిన రేషన్‌బియ్యంతో పాటు 154 కేజీల నూకలను సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.